సాక్షి నిర్మల్

బుధవారం : 20 : మార్చి : 2024



కుడుక అను'బంధం'

సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో హోలీ(దు రాడి)పండుగ జరుపుకుంటారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:28	గురు : 4:57

గరిష్టం/కనిష్టం 34.4 /21.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా, పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తరగతిగదే విజ్ఞానఖని



సందేశం ఇస్తున్న రాజసాగర్

నిర్మల్‌ఖిల్లా: జ్ఞానముపార్జనలో తరగతిగదిని మించిన విజ్ఞానఖని లేదని ఏబీవీపీ ఇందూర్ విభాగ్ సంఘటన మంత్రి రాజసాగర్, జిల్లా కన్వీనర్ కైరి శశి అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక వశిష్ఠ డిగ్రీ కళాశాలలో 'పరిసర్ చలో అభియాన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ఎక్కువ సమయం కళాశాల తరగతి గదిలోనే గడపాలన్నారు. దీని ద్వారానే విషయ పరిజ్ఞానం సంపాదించవచ్చని సూచించారు. ప్రతీరోజు కళాశాలకు హాజరైతే బహుళ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కళాశాలకు ప్రతీ రోజు రావడం వలన విద్యార్థులు, అధ్యాపకుల మధ్య స్నేహబంధం ఏర్పడుతుందని తెలిపారు. భవిష్యత్తు గురించి మరెన్నో విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కన్వీనర్ కైరి శశి, శశాంక్, సాయిచరణ్, నరేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



తిమ్మాపూర్‌లో పర్యటిస్తున్న డీపీవో శ్రీనివాస్

భైంసారూరల్: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పరిసరాలు, మురుగు కాలువలు, పారిశుధ్య పనుల గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఎండాకాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ అశోక్, కార్యదర్శి ప్రియాంక, కారోబార్ పోతన్న తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సన్మానం



సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: ఇటీవల జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంఏ.రజాక్‌ను జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గౌడ జన హక్కుల పోరాట సమితి సభ్యులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూల మొక్కతో సన్మానించారు. ఇందులో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, బాలాగౌడ్, గణేశ్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు

కుంటాల: కుంటాలలోని ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయ 8వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో అభిషేకం, శ్రీలక్ష్మి అష్టోత్తర శతనామ స్తోత్రం, విష్ణు సహస్ర నామ పారాయణం, భగవద్గీత పారాయణం, హోమం తదితర పూజలు నిర్వహించారు. ఎంపీపీ ఆ ప్క గజ్జారాం యాదవ్ -సుజాత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేసినేని నర్సింగరావు, వైస్ చైర్మన్లు కె.కృష్ణారావు, ఎల్లమ్మల శంకర్, గౌరవ సభ్యులు తాటి శివ, సత్యానంద, గడ్డపు గజ్జారాం, నాగారావు, భక్తులు పాల్గొన్నారు.

రూ.1.10 కోట్లు విడుదల

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.1.10 కోట్ల విడుదలైనట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు తెలిపారు. పట్టణంలోని తాగునీటికి సరఫరా, శానిటేషన్ ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సక్రమం కోసం అక్రమం!

- జీవో.59 పేరిట నిర్మల్‌లో భూమాయ..
- దర్గాగా విలువైన భూముల కబ్జా
- కందకాలు, కట్టలూ ఖతం
- సరైన విచారణ లేకుండానే క్రమబద్ధీకరణ



కుంచించుకుపోయిన కందకం



ఇదీ.. చైన్‌గేట్ వద్ద కందకం పరిస్థితి..

నిర్మల్: గత ప్రభుత్వం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం తీసుకువచ్చిన జీవో.59 నిర్మల్‌లో భూ ఆక్రమణదారులకు వరంగా మారింది. ఈ జీవోను అడ్డం పెట్టుకుని విలువైన భూములను దర్గాగా కబ్జా చేస్తున్నారు. కందకాలు, కట్టలనూ ఖతం చేశారు. తమ కళ్లెదుటే విలువైన సర్కారు భూములు దోపిడీ అవుతుండడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇక అడ్డుకోవాల్సిన అధికారుల సహకారంతోనే ఈ కథ నడుస్తోందని ఆరోపిస్తున్నారు. ఇక రెవెన్యూ అధికారులు సరైన విచారణ జరుపకుండానే క్రమబద్ధీకరించడం అనుమానాలకు తావిస్తోంది.

ఏళ్లుగా ఖాళీ జాగాలు..

జిల్లాకేంద్రంలో చైన్‌గేట్ అంటే తెలియని వారుండరు. 10–15 ఏళ్లక్రితం వరకూ ప్రధాన రహదారికి రెండువైపులా భారీ గొలుసులతో బురుజులు ఉండేవి. ఇందులో ఒకవైపు రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చేశారు. మరోవైపు ఇప్పటికీ ఉన్న ఒక్క బురుజు నిర్మల్ చరిత్రకు, ఇక్కడి చారిత్రక ఆనవాళ్లకు 'నేనే సాక్షి..' అన్నట్లుగా ఉంది. ఈ చైన్‌గేట్ బురుజులను ఆనుకునే భారీ రక్షణ కందకం ఉండేది. దీన్నే క్రమంగా ఆక్రమిస్తూ డ్రైనేజీగా మార్చేశారు. తరతరాలుగా నిర్మల్‌ను చూస్తున్న వారందరికీ చైన్‌గేట్‌తోపాటు ఈ కందకం ఎలా ఉండేదన్న విషయం స్పష్టంగా తెలుసు. అలాగే ప్రస్తుతం భాగ్యనగర్‌లో చేపల మార్కెట్ పక్కన ఉన్న కందకమూ కబ్జా అవుతోంది. ఇప్పటికే ఓ వైపు ఏకంగా నిర్మాణాలను చేపట్టగా, మరోవైపూ కందకంలోకి చొచ్చుకువచ్చి నిర్మాణాలు చేస్తున్నారు. ఏళ్లుగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు ఇలా తమ కళ్ల ముందే ఆక్రమణకు గురవుతుండడంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీవో.59 పేరిట..

చైన్‌గేట్ వద్ద నిల్చుని చూస్తే చాలు.. అక్కడ ఉన్న కందకాన్ని ఎలా కనుమరుగు చేస్తున్నారో.. స్పష్టంగా కనబడుతుంది. కూల్చేసిన బురుజువైపు, పెట్రోల్‌బంక్ వెనుకాల ఉండాల్సిన కందకాన్ని ఇప్పటికే చిన్నపాటి డ్రైనేజీగా మార్చేశారు. అక్కడ ఏకంగా హద్దులు పెట్టుకున్నారు. ఇంకోవైపూ ఇదే కథ మొదలైంది. కందకాన్ని ఆనుకుని బస్‌డిపోకు మధ్యలో ఉన్న స్థలాన్ని కబ్జా చేశారు. ఇందులో కొంతభాగాన్ని గత ప్రభుత్వ హయాంలో జీవో.59 పేరిట సొంతం చేసుకోగా, మిగతా స్థలాన్ని అదే జీవో పేరు చెప్పి ఆక్రమిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈవైపు ఉన్న కందకాన్నీ క్రమంగా ఆక్రమిస్తూ దాన్ని స్వరూపాన్నే మార్చేస్తున్నారు. జీవో.59 సమయంలో రెవెన్యూ అధికారులకు పెద్దమొత్తంలో చేతులు తడపడంతోనే చాలావరకు సర్కారు భూములు కబ్జా అవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆక్రమణలతోనే ముంపు..

రెండేళ్లుగా నిర్మల్ వర్షాకాలంలో నీట మునుగుతోంది. వర్షాలు కురిస్తే చాలు పట్టణం జలదిగ్బంధమవుతోంది. ఇందుకు కందకాలు, నాలాలను కబ్జాలు చేయడమే కారణం. ప్రతీ వర్షాకాలంలో శివాజీచౌక్ చెరువులా మారడానికి ఈ ప్రాంతంలో ఉన్న నాలాలన్నింటిపైనా ఆక్రమణలు ఉండటమే. గత పాలకులు వీటిని గుర్తించినా.. పూర్తిగా తొలగించలేదు. ఈ ప్రభావమూ ఎన్నికల్లో కనిపించిందన్న వాదన ఉంది. పాలకులు మారినా మళ్లీ కబ్జాలపర్వమే కొనసాగుతుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. మళ్లీ వర్షాకాలం నిర్మల్ నీటమునగాల్సిందేనా..! అని మండిపడుతున్నారు. మరోవైపు ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులూ స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

నిర్మల్ జిల్లా కేంద్రంలో చెరువులు, నాలాలు, కందకాల కబ్జాలపై చర్యలు చేపడుతున్నాం. ఆక్రమణలు గుర్తించేందుకు ప్రత్యేకంగా లేక్ కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నాం.

– రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

కేబీఎంకు 'ఎదురు'దెబ్బ!

- గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఇద్దరు తూర్పు జిల్లా పరిధి కమిటీ వారే..
- పట్టుకోల్పోతున్న కుమురంభీం మంచిర్యాల కమిటీ



వర్గీశ్(ఫైల్) మృతుల ఫైల్ ఫొటోలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు మావోయిస్టు పార్టీ కేబీఎం(కుమురంభీం, మంచిర్యాల) కమిటీకి కోలుకోలేని 'ఎదురు'దెబ్బ తగిలింది. మంగళవారం తెల్లవారుజామున మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహెరి తాలూకా కొలమర్క కొండలకు ఐదు కిలోమీటర్ల దూరంలో రేపన్‌పల్లి శివారు అడవుల్లో అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో సీ60, సీఆర్పీఎఫ్ క్యూఏటీ(క్విక్ యాక్షన్ టీం), మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మంచిర్యాల, కుమురంభీం(కేబీఎం) కమిటీ సభ్యుడు, డివిజనల్ కమిటీ మెంబర్(డీవీసీఎం) మంగి, ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శిగా ఉన్న వర్గీశ్ కోయ అలియాస్ మంగులు, డీవీసీఎం, సిర్పూర్-చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్తూ, ఇద్దరు ప్లాటూన్ సభ్యులు కుర్సాంగ్ రాజు, కుడిమెత వెంకటేశ్ చనిపోయినట్లుగా గుర్తించారు. ఇంకా బలగాల ఆపరేషన్ కొనసాగుతోంది. వీరిపై రూ.36లక్షల రివార్డు ఉంది.

పట్టు కోసం ప్రయత్నాలు..

కేబీఎం కమిటీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ కొన్నేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ క్రమంలో తొలిసారిగా 2013లో ఇంద్రవెల్లి మండలం వాయిగూడ క్యాంపులో ఉన్నప్పుడు అడెల్లు పోలీసుల కళ్లుగప్పి తృటిలో తప్పించుకున్నాడు. కొన్నాళ్లు దండకారణ్యానికే పరిమితం అయ్యాడు. 2016లో తిర్యాణి మండలం మంగీ దళ కమాండర్ ఆత్రం శోభన్ అలియాస్ చార్లేస్ ఛత్తీస్‌గఢ్‌లో చనిపోవడంతో ఈ దళం క్రమంగా క్రియాశీలతను కోల్పోయింది. కేబీఎంగా రూపాంతరం చెందాక అడెల్లు ప్రాతినిధ్యం వహిస్తూ మరింత పట్టు పెంచుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన అడెల్లుకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది. పాత పరిచయాలు, సానుభూతిపరులతో 2020లో గిరిజన, ఆదివాసీ యువతను నియామకం చేసుకునేందుకు ప్రయత్నించి వీలుగాక తిరిగి వెళ్లిపోయారు. ఆ ఏడాది జూలైలో మంగీ, గుండాలలో దళ సంచారం ఉందనే సమాచారంతో విస్తృతంగా కూంబింగ్ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో గ్రేహౌండ్స్ బలగాలు కాగజ్‌నగర్ మండలం కదంబా అడవుల్లో జరిపిన కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కేబీఎం కమిటీ యాక్షన్ టీం సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్కాలు, మరొకరు చనిపోయారు. 2022 డిసెంబర్‌లో అడెల్లు సహచరి, నిర్మల్ జిల్లా కడెం పెద్దూర్ మండలం లక్ష్మీసాగర్‌కు చెందిన కంతి లింగవ్వ, అలియాస్ అనితా కేబీఎం అసిస్టెంట్ కమాండర్‌గా పని చేస్తుండగా ఛత్తీస్‌గఢ్‌లోని టేకమెట అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. వరుసగా ఘటనలతో పట్టు కోల్పోగా, తాజాగా కమిటీలో కీలక సభ్యులు సైతం మరణించడంతో మరింత బలహీనపడనుంది.

స్థానిక పోలీసుల అప్రమత్తం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెన్‌గంగా, ప్రాణహిత, గోదావరి తీరాల్లో అనుమానాస్పద కదలికలపై స్థానిక పోలీసులు నిఘా పెంచారు. డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, అంతర్రాష్ట్ర పోలీసుస్టేషన్ల అప్రమత్తం, ఫెర్రి పాయింట్ల భద్రత చేపట్టారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు చేసే అవకాశం ఉందనే సమాచారంతో అప్రమత్తం కాగా, తాజాగా జరుగుతున్న పరిణామాలతోనూ స్థానిక పోలీసు యంత్రాంగం పోలింగ్ ముగిసి, ఫలితాల వెల్లడి వరకు భద్రత కట్టుదిట్టం చేసి ప్రత్యేక బలగాలతో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

పోలీస్ సిబ్బందికి గ్రేహౌండ్స్ శిక్షణ

- ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల



సూచనలు ఇస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పటిష్ఠంగా విధులు నిర్వహించేందుకు వారంరోజులు గ్రేహౌండ్స్ ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించే శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా కోసం ఈ ట్రైనింగ్ ఉపయోగపడుతుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలు, మెలకువలు నేర్చుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు చెక్‌పోస్టుల వద్ద డ్యూటీలు, వాహనాల తనిఖీ, ఇతర సంబంధిత విధుల నిర్వహణకు ఈ శిక్షణ దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐలు రామ్ నిరంజన్, శైలేందర్, రామకృష్ణ, ఆర్‌ఎస్సైలు వినోద్, రాజశేఖర్, సాయికృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షానికి విరిగిన విద్యుత్ స్తంభాలు



ట్రాన్స్ ఫార్మర్‌ను మోసుకుపోతున్న రైతులు

లక్ష్మణచాంద: మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి విద్యుత్ సంస్థకు భారీగా నష్టం జరిగింది. 25 స్తంభాలు, 5 ట్రాన్స్ ఫార్మర్లు పడిపోయాయని విద్యుత్ ఏఈ మహేశ్ తెలిపారు. చింతల్‌చాంద సమీపంలో 02 ట్రాన్స్ ఫార్మర్లు, చామన్‌పెల్లి సమీపంలో 03 ట్రాన్స్ ఫార్మర్లు పడిపోయాయని పేర్కొన్నారు. మండలంలో 25 విద్యుత్ స్తంభాలు విరిగాయని తెలిపారు. ఇప్పటికే మరమ్మతులు ప్రారంభించామని చాలా వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. చామన్‌పల్లి, చింతల్‌చాంద గ్రామాల రైతుల సహకారంతో ట్రాన్స్ ఫార్మర్లు తరలించి అందులో ఆయిల్ నింపి బుధవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

గడ్డపార పట్టిన డీఆర్డీవో



కూలీలతో కలిసి గడ్డపార పట్టిన విజయలక్ష్మి

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో వెంకటేశ్వర్ కుంటలో ఉపాధి హామీ పథకంలో పూడికతీత పనులు చేస్తున్నారు. డీఆర్డీవో విజయలక్ష్మి మంగళవారం పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. అనంతరం తాను కూడా గడ్డపార తీసుకుని కూలీలతో కలిసి కాసేపు మట్టి తవ్వారు. ఎండలు పెరుగుతున్నందున కూలీలు ఉదయమే పనికి రావాలని సూచించారు. ఉపాధి కూలీలు గ్రూపులుగా ఏర్పడి తుంగతో బుట్టలు తయారు చేయాలని తెలిపారు. బుట్టలు ఎలా తయారు చేయాలో శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో ఎక్కడా తయారు చేయడం లేదని, విదేశాల్లో ఈ బుట్టలకు డిమాండ్ ఉందని తెలిపారు. అనంతరం వేణునగర్ గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. డీఆర్డీవో వెంట ఎంపీడీవో రమాకాంత్, ఏపీవో రాజశేఖర్, ఎఫ్‌ఏలు భూమన్న, గోపి, పంచాయతీ కార్యదర్శి సుజాత, నాయకులు రాజన్న, ఉపాధి కూలీలు ఉన్నారు.

పల్లెలు భేష్!

- పన్నుల వసూలులో ఆదర్శంగా నిలుస్తున్న గ్రామాలు
- 38 జీపీల్లో వందశాతం వసూలు
- వందకుపైగా జీపీల్లో 90 శాతం..

జిల్లాలోని జీపీల్లో పన్నుల వసూలు ఇలా...

గ్రామ పంచాయతీలు :	396
గత బకాయిలు :	రూ.88,13,923
ప్రస్తుత డిమాండ్:	రూ.9,51,30,934
మొత్తం పన్నుల డిమాండ్ :	రూ.10,39,44,857
ఇప్పటివరకు వసూలైనవి :	రూ.8,25,00,505



భైంసాటౌన్: ఆస్తి పన్నుల వసూలులో పంచాయతీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. పన్నుల చెల్లింపులో గ్రామీణ ప్రజలు పట్టణ వాసులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈనెలాఖరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ఇప్పటివరకు దాదాపు 80 శాతం పన్నులు వసూలయ్యాయి. మరికొద్దిరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా జిల్లా అధికారులు వందశాతం వసూలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఏ స్థానిక సంస్థల అభివృద్ధికైనా నిధులే ప్రధానం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు ఏటా ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తున్నా.. సకాలంలో మంజూరు కాకపోవండంతో గ్రామ పంచాయతీలకు నిర్వహణ భారంగా మారుతోంది. గ్రామాల్లో చిన్నాచితక పనులకు సైతం ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆస్తిపన్ను వసూలుతో పంచాయతీలకు కొంతమేర ప్రయోజనం చేకూరే అవకాశముంది.

ఆదర్శం.. ఆ గ్రామాలు

జిల్లాలో పలు గ్రామాలు వందశాతం పన్నులు చెల్లించి ఆదర్శంగా నిలిచాయి. ఆర్థిక సంవత్సరం ముగియకముందే వందశాతం పన్నుల వసూలు లక్ష్యం చేరుకున్నారు. దిలావర్‌పూర్ మండలం కంజర్, మాయాపూర్, సాంగ్వి, తానూర్ మండలం నంద్‌గాం, బోల్సా, హిప్నెల్లి, సింగన్‌గాం, బోంద్రట్, కోలూర్ తండా, కుభీర్ మండలం రంజని, కుంటాల మండలం అంబకంటి తండా, అందకూర్, మేడన్‌పూర్, వెంకూర్, సారంగపూర్ మండలం సోనాపూర్ తండా, పెండల్‌ధరి, పెంబి మండలం ధూందరి, యెంగ్లాపూర్, కర్నంలొద్ది, కోసగుట్ట, నాగాపూర్, పస్పుల, షెట్పల్లి, జంగగూడ, లోట్యాకర తండా, పోచంపల్లి, పుల్గపాంద్రి, రాంనగర్, తాటిగూడ, వేణునగర్, యాపల్‌గూడ, ఖానాపూర్ మండలం మస్కాపూర్, చందునాయక్ తండా, కొలాంగూడ, దస్తురాబాద్ మండలం పెర్కపల్లి, నర్సాపూర్(జి) మండలం నందన్, బామ్ని(బి), సోన్ మండలం సంగంపేట్ గ్రామాల్లో ప్రజలు వందశాతం పన్నులు చెల్లించారు. వందకుపైగా పంచాయతీలు 90 శాతం వరకు పన్నులు వసూలు చేశాయి.

కొన్నిచోట్ల 50 శాతం దాటని వైనం..

కొద్దిరోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో 50 శాతం కూడా పన్నుల వసూలు కాలేదు. బాసర మండలం లాబ్దిలో 1.04 లక్షల పన్ను వసూలుకు రూ.43.32 వేలు వసూలయ్యాయి. బిద్రెల్లిలో రూ.4.53 లక్షలకు రూ.1.29 లక్షలు, ఓనిలో రూ.99.29 వేలకు రూ.22 వేలు, కడెం మండలం మాసాయిపేట్‌లో రూ.2.07 లక్షలకు రూ.64.67 వేలు, ముధోల్ జీపీలో రూ.29.93 లక్షలకు కేవలం రూ.9.33 లక్షలు, భైంసా మండలం మహాగాంలో రూ.4.32 లక్షలకు రూ.1.08 లక్షలు, మిర్జాపూర్‌లో రూ.1.69 లక్షలకు రూ.40.65 వేలు, కుభీర్ మండలం హల్దా గ్రామంలో రూ.8.05 లక్షలకు రూ.50 వేలు మాత్రమే వసూలయ్యాయి.

పన్నులు చెల్లించి సహకరించాలి...

గ్రామాల్లో ప్రజలు ఆస్తిపన్నులు సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలి. వందశాతం పన్నుల వసూలు కోసం పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. గడువులోగా లక్ష్యం చేరుకుంటాం.

– శ్రీనివాస్, డీపీవో, నిర్మల్

పోరాడి డిమాండ్లు సాధించుకుందాం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు

నిర్మల్‌చైన్‌గేట్: కార్మికులు ఐక్యంగా ఉంటేనే ఎలాంటి డిమాండ్ అయినా సాధించుకోగలమని విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ సంఘ భవనంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రాజు అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి పోచయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా కాలంగా ఎదురు చూస్తున్నా సింగిల్ మాస్టర్ స్కేల్ మొన్నటి వేతన సవరణలో సాధించుకున్నామన్నారు. అన్ని సంఘాలను ఏకం చేసి జేఏసీగా ఏర్పడి పీఆర్సీ సాధించుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు. వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలు తక్షణమే జరిపించి మెజారిటీ యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలన్నారు. సుదీర్ఘ కాలంగా కంపెనీలో చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్న అన్ మన్డ్ డిస్ట్రిబ్యూషన్, అన్‌స్కిల్డ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగులపై అజ్ఞాత వ్యక్తుల ఫిర్యాదులపై చర్యలు తీసుకోవద్దని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, రాష్ట్ర కోశాధికారి చిన్నస్వామి, డిస్కం అధ్యక్షుడు రఘునందన్, కార్యదర్శి శేషగిరిరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి సుధీర్, నిర్మల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు మనోహర్‌స్వామి, కె.వెంకటరమణ, ఆదిలాబాద్, మంచిర్యాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

భైంసాటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భైంసా ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఆయా తరగతుల్లో ప్రవేశాల కోసం ఈనెల 4 నుంచి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. భైంసాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎస్టీ–1, 8వ తరగతిలో ఎస్సీ–1, ఎస్టీ–1, మైనార్టీ–1, 9వ తరగతిలో ఓసీ–1 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. tg.gurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'పది' పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌టౌన్: పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం పరీక్ష కేంద్రాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకీషర్మిల తనిఖీ చేశారు. జుమ్మెరత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని చాణక్య హైస్కూల్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లను అనుమతించొద్దని సూచించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ గంగారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

బాసర అమ్మవారి ఒడి బియ్యం లెక్కింపు



ఒడి బియ్యం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఒడిబియ్యం హుండీలను తెరిచారు. ఇందులో 51.30 క్వింటాళ్ల ఒడి బియ్యం, 230 కిలోల ఎండుకొబ్బరి, 16 కిలోల బరడిపోకలు, 40 కిలోల పసుపు కొమ్ములు, 10 కిలోల బాదం, 32 కిలోల కర్జూర పండ్లు భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఒడి బియ్యం ద్వారా రూ.69,242 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, వాగ్దేవి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఉత్తమ ట్రైనర్‌గా చౌహాన్ కృష్ణ



ఉత్తమ మోటివేషనల్ ట్రైనర్ సర్టిఫికెట్ అందుకుంటున్న చౌహాన్ కృష్ణ

భైంసాటౌన్/నార్నూర్ : నార్నూర్ మండలంలోని మహాగావ్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ చౌహాన్ కృష్ణ ఉత్తమ మోటివేషనల్ ట్రైనర్ సర్టిఫికెట్ పొందారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని హోటల్ మినర్వాగ్రాండ్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వరరావు, సినీ నటుడు ప్రదీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాధవి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. సామాజిక సేవను గుర్తించి తనకు సర్టిఫికెట్ అందించినట్లు చౌహాన్ కృష్ణ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఒకరిపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోలిపూరకు చెందిన మునీర్ బేగ్‌పై సోమవారం రాత్రి 11 గంటలకు కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ షబాద్, సయ్యద్ రేహన్ హష్మీ కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితుడి తల్లి గులాబ్‌బీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై కేసు

నిర్మల్: సారంగాపూర్ మండలం కుప్టిలో గుడుంబా విక్రయిస్తున్న మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు కుప్టి గ్రామ సమీపంలో గాలిస్తుండగా ఓ మహిళ గుడుంబా క్యాన్‌తో వెళ్తున్నట్లు గమనించి తనిఖీ చేయగా ఆమె వద్ద 8 లీటర్ల గుడుంబా దొరికినట్లు తెలిపారు. సదరు గుడుంబాను స్వాధీనం చేసుకుని మహిళపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇకమీదట ఎవరైనా గుడుంబా తయారు చేసినా విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుడుక అను‘బంధం’



కిరాణం షాపులో కుడుకలు కొనుగోలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు

- హోలీకి సిద్ధమవుతున్న ఆదివాసీ గూడేలు
- ఎక్కడున్నా పండక్కి ఊరికి రావాల్సిందే
- వేడుకలకు సిద్ధమవుతున్న గిరిజనులు
- కుడుక ఇచ్చిన కుటుంబాలే లెక్కలోకి..



చక్కెర బిళ్లలు కొనుగోలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో హోలీ(దురాడి)పండుగ అత్యంత పవిత్రంగా... భిన్నంగా నిర్వహిస్తారు. గ్రామస్తులు ఊళ్లో ఉండాలంటే కాముడి దహనం రోజు గ్రామ పెద్దలకు కుడుక ఇవ్వాల్సిందే. అలా ఇస్తేనే ఆ కుటుంబం గ్రామ జాబితాలో ఉంటుంది. కుడుక ఇవ్వనివారితో గ్రామస్తులకు ఎలాంటి సంబంధం ఉండదు. ఆ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఊళ్లో వాళ్లు వెళ్లరు. అందుకే బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి వెళినా ఉద్యోగ, రాజకీయ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారుకూడా హోలీకి తప్పకుండా స్వగ్రామానికి వస్తారు. తరాలుగా వస్తున్న ఆచారాన్ని ఆదివాసీలు నేటికీ పాటిస్తున్నారు.

దురాడీ కొట్రేతో కుటుంబాల లెక్క

కుడుకను ఆదివాసీల భాషలో దురాడీ కొట్రే (హోలీ కుడక) అని పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈ పండుగ ఘనంగా నిర్వహిస్తారు. హోలీకి ఒకరోజు ముందు గ్రామ పెద్ద పటేల్ ఇంట్లో కూర్చొని తమ గ్రామంలో ఎన్ని కొత్త కుటుంబాలు చేరాయి. ఎన్ని కుటుంబాలు ఊరు వదిలి వెళ్లాయనేది కాముడి దహనం రోజు గ్రామస్తులు ఇచ్చిన కుడుకల ఆధారంగా లెక్కచూస్తారు. కొత్తగా కాపురాలు పెట్టిన వారుకూడా ఈ రోజే గ్రామ జాబితాలో చేరడానికి అవకాశం ఉంటుంది.

బూడిదకు అత్యంత ప్రాధాన్యం

ఆదివాసీ సంప్రదాయం ప్రకారం కాముడి దహనం చేసిన బూడిదను ఇండ్ల ముఖద్వారాల వద్ద గీతగా వేస్తారు. ఇలా వేస్తే ఎలాంటి దుష్టశక్తులు ఇంట్లోకి రావని ఆదివాసీల నమ్మకం. అంతేకాకుండా ఆదివాసీ గ్రామాల్లో అతి పవిత్రంగా నిర్వహించే దండారీ ఉత్సవాల్లో కాముడి దహనం బూడిదకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. గుస్సాడీల వేషధారణకు ఈ బూడిదనే ఉపయోగిస్తారు.

కాముడి దహనం...

హోలీకి ఒకరోజు ముందు కుడుకలు సేకరించిన అనంతరం అటవీప్రాంతం నుంచి మాతారి, మాత్రాల్ (వృద్ధురాలు..వృద్ధుడు) పేర్లతో తీసుకొచ్చిన రెండు వెదురు బొంగులకు ఇళ్ల నుంచి సేకరించిన కుడుక ముక్కలు, చక్కెర బిళ్లల హారాలు, ఉల్లిమొక్కలు, నైవేద్యం, మోదుగపూలతో పేర్చి గ్రామ పొలిమేరలో సంప్రదాయ వాయిద్యాల మధ్య కాముడిదహనం చేస్తారు. ఆ స్థలంలో రాత్రంతా జాగారం ఉంటారు. జాజిరిరూపంలో ఇళ్ల నుంచి సేకరించిన నవధాన్యాలతో గుడాలు వండడంతో పాటు ఆ రోజు దొంగిలించి తెచ్చిన కోళ్లు, మేకపోతులను ఆస్థలంలో బలిస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. మరుసటి రోజు బావ బావమరుదులు, చిన్నాపెద్ద తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడుపుతారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యం చేస్తారు.

పకడ్బందీగా కుడుక సేకరణ



ఆదివాసీ గ్రామాల్లో హోలి ఘనంగా నిర్వహిస్తాం. కాముడి దహనం రోజు గ్రామ పెద్ద ఇంట్లో పెద్దల సమక్షంలో కుడుక సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. సేకరించిన కుడుకల ఆధారంగా గ్రామంలో నివాసం ఉంటున్న కుటుంబాల లెక్క చూస్తాం. ఈ ఆచార వ్యవహారాలను పాటిస్తూ భావితరాలకు అందిస్తున్నాం.

– వెట్టి రాజేశ్వర్, పిట్టబొంగరం గ్రామ పటేల్

అకాల వర్షం.. తడిసిన ధాన్యం..



తడిసిన మొక్కజొన్న పంటను చూపిస్తున్న రైతు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని మర్కగూడ, అందునాయక్‌తండా, హీరాపూర్, ఏమాయికుంట, సమాక, సట్వాజిగూడ, చింతకర, కేస్లాగూడ, ముత్నూర్, తుమ్మగూడ, తదితర గ్రామాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చేతికి అందివచ్చిన మొక్కజొన్న, జొన్న, గోధుమపంటలు నేలకొరిగాయి. ఆరబెట్టిన మొక్కజొన్న కుప్పల్లోకి నీరు చేరడంతో మక్కలు తడిసిపోయాయి. తీవ్ర నష్టం జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉత్తమ షార్ట్‌ఫిల్మ్‌గా ‘శ్రీకారం’

- ఉత్తమ దర్శకురాలిగా మేరీమాత



పురస్కారం అందుకుంటున్న మేరీమాత

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, దర్శకురాలు చిత్తూరు మేరీమాత దర్శకత్వంలో నిర్మించిన షార్ట్ ఫిల్మ్ ‘శ్రీకారం’ రాష్ట్రస్థాయి ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఐద్వా సంస్థ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ ఫిలిం ఎంపిక పోటీల్లో ‘శ్రీకారం’ షార్ట్ ఫిలిం ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రాన్ని రావుల శామ్యూల్ నిర్మించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ షార్ట్ ఫిలిం దర్శకురాలిగా మేరీమాత పురస్కారం అందుకున్నారు. ప్రస్తుత సమాజంలో ట్రాన్స్‌జెండర్స్‌పై వివక్ష, జీవనోపాధి కోసం వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇందులో రూపొందించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చలనచిత్ర టీవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడిచెర్ల రాజు, కెమెరామెన్ కృష్ణవర్మ, పడాల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన చేపల వేట

- వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి



రాజన్న మృతదేహం

మామడ: చేపల వలలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన మత్స్యకారుడు చెరుకు రాజన్న(46)మంగళవారం గ్రామ సమీపంలోని యెంగన్న చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగాడు. సమీపంలో ఉన్న జాలరులు గమనించి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమ లే అవుట్లపై బల్దియా అధికారుల కొరడా



లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న దృశ్యం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లపై బల్దియా అధికారులు కొరడా ఝులిపించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ పరిధిలోని అనుకుంట, బంగారుగూడ, ఖానాపూర్, అంకోలి సమీపంలోని వివిధ సర్వే నెంబర్లలో గల అక్రమ లేఅవుట్లను బల్దియా సిబ్బంది పరిశీలించారు. వాటికి అధికారిక అనుమతులు లేకపోవడంతో వాటిల్లో ప్లాట్లుగా విభజిస్తు పాతిన బండరాళ్లను జేసీబీతో తొలగించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసే లేఅవుట్లలోని ప్లాట్లను ప్రజలు కొనుగోలు చేయవద్దని ఈ సందర్భంగా టీపీవో సూచించారు. భవిష్యత్‌లో అనుమతుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

- నిందితురాలి రిమాండ్



రికవరీ చేసిన బంగారం, నగదు

జైనథ్: మండలంలోని మాకోడ గ్రామానికి చెందిన నిమ్మల రవికాంత్‌రెడ్డి నివాసంలో ఈ నెల 11న చోరీకి గురైన 4 తులాల బంగారం, రూ.40వేల నగదును రికవరీ చేసినట్లు జైనథ్ సీఐ డి.సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ రవికాంత్ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దొంగతనానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మాకోడ గ్రామ బస్టాండ్ వద్ద నిందితురాలి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు. కాగా అత్యాశతోనే చోరీకి పాల్పడిందని సీఐ తెలిపారు. వారం రోజుల్లోనే కేసును ఛేదించిన సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, కానిస్టేబుళ్లు శివాజీ, రాజు, స్వామిని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అభినందించారు.



జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట మట్టికుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు



మట్టితో తయారు చేసిన వాటర్ బాటిళ్లు

మట్టి కుండ.. మస్తు సల్లగ..



వేసవికాలంలో మట్టికుండలోని నీళ్లు తాగితే చల్లదనంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుంది. అందుకే ఎన్ని ఫ్రిజ్‌లు వచ్చినా రంజన్లకు డిమాండ్ తగ్గడంలేదు. ప్రస్తుతం ఎండలు ముదరడంతో మట్టికుండలు, రంజన్లకు గిరాకీ పెరిగింది. రాజస్థాన్ నుంచి తెప్పించిన రంజన్లను జిల్లా కేంద్రంలోని, ఎస్పీ క్యాంప్ కార్యాలయం పక్కన, శివాజీ చౌక్ ప్రాంతంలో, పలుచోట్ల విక్రయిస్తున్నారు. వివిధ ఆకృతుల్లో తయారుచేసిన మట్టి కుండలు, వాటర్ బాటిళ్లు, కుజాలు ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో రంజన్‌కు రూ.200 నుండి రూ.500వరకు, వాటర్ బాటిల్‌కు రూ.100 నుంచి రూ.300 వరకు అమ్ముతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



రాజస్థానీ నల్లరంగు కుండలు

సేవాలాల్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని ఆరెపల్లి (లింగట్ల) గ్రామంలోని శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నాని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు.

మట్కా నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఇద్దరు మట్కా జూదరులను మంగళవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. పట్టణంలోని ఖుర్షిద్‌నగర్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో సీసీఎస్ పోలీసులతో పాటు టు టౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. సుందరయ్యనగర్‌కు చెందిన అబ్దుల్ సలాం, ఎస్‌కే అహ్మద్ మట్కా ఆడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,330 నగదుతో పాటు మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఎక్కడైనా మట్కా ఆడుతున్నట్లు తెలిస్తే సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ (8712659965)కు సమాచారం అందించాలని సూచించారు.

‘గురుకులం’లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో గోపీచంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో బాలురు బీఎస్సీ (ఎంపీసీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (బీజెడ్‌సీ), (ఎంబీజెడ్‌సీ), బీకాం (ఏ), (బీఏ), బీఏ (హెచ్‌పీఎస్), మంచిర్యాల జిల్లాలో బాలురు బీఎస్సీ (ఎంపీజీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్), (బీజెడ్‌సీ), బీకాం (ఏ), (బీఏ), (ఈపీఎస్‌పీఏ), కుమురంభీంజిల్లాలో బాలికలు బీఎస్సీ (ఎంపీసీ), (ఎంపీసీఎస్), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్), (బీజెడ్‌సీ), బీకాం (ఏ), బీకాం (జీ), బీఏ (ఈపీహెచ్), ఆదిలాబాద్ జిల్లాలో బాలికలు బీఎస్సీ (ఎంపీసీ), (ఎంఎస్‌సీఎస్), (ఎంఎస్‌డీఎస్), (బీజెడ్‌సీ), బీకాం (జీ), (ఏ), బీఏ (ఈపీహెచ్) కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ప్రతీ కోర్సుకు 40 చొప్పున సీట్లు ఉంటాయని, ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంతుళ్ల కోసం విద్యార్థుల పడిగాపులు

పలువురికి ఆదర్శంగా నిలవాల్సిన కొంతమంది గురువులు సమయపాలన పాటించకుండా వారికి నచ్చినప్పుడే బడిబాట పడుతున్నారు. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రత కారణంగా ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తోంది. ఉదయం 8 గంటలకే తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా 8:15 గంటల వరకు ఉపాధ్యాయులు రాకపోవడంతో తలమడుగు మండలం సాయిలింగి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేట్ తాళం తీయలేదు. ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు గేటు వద్దే నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



వాతావరణం కూల్ కూల్







కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృత్తమై ఉండగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వర్షం పడింది. చిరు జల్లులతో మొదలై మోస్తరుగా గంటన్నర పాటు ఏకధాటిగా కురిసింది. దీంతో ఆదిలాబాద్ పట్టణం తడిసి ముద్దయింది. వాహనదారులు, వీధి వ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎండల వేడితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లబడిన వాతావరణంతో కొంత ఊరట లభించింది.

క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కడెం: మండలంలోని నర్సాపూర్‌లో పేద కుటుంబానికి చెందిన కుడిమేత అమృత్‌రావు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. మంగళవారం 'హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్' సభ్యులు బాధితుడిని పరామర్శించి రూ.ఐదు వేలను ఆర్థికసాయంగా అందించారు. అమృత్‌రావుకు దాతలు తోచిన సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వర్దేల్లి మహేశ్, మణికంఠ, మాజీ సర్పంచ్ బాదురావు తదితరులు ఉన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మణచాంద: మండలంలో బుధవారం, గురువారం వర్షాలు కురిసే అవకాశం ఉందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యసాయాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మాట్లాడారు. ఉరుములు, ఈదురుగాలులతో వర్షం పడే అవకాశం ఉందని.. పసుపు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శివరాజ్

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ శివరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని బాదనకుర్తి గ్రామ సమీపంలో చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ బృందంతో వాహనాలను తనిఖీ చేశారు. వారి వెంట సిబ్బంది రాజేశ్వర్, సురేందర్, సురేశ్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఒక యూరియా బ్యాగు ధర రూ.270 ఉందని.. కావాల్సిన రైతులు బుధవారం ఉదయం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మహిళా దినోత్సవం


వైశ్య వారధి మహిళా సంఘం సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గ్రాండ్ కుబేర హోటల్‌లో మంగళవారం నిర్మల్ వైశ్య వారధి మహిళా సంఘ సభ్యులు మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆటల, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం వైశ్య వారధి జిల్లా అధ్యక్షురాలు గాదే శ్రీదేవి మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. రాష్ట్ర శాఖ వ్యవస్థాపకుడు సాంబశివరావు, రాధిక, అలేఖ్య, సునీత తదితరులున్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

కడెం: తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం 12–డీ ఫారంపై బీఎల్‌వోలకు తహసీల్దార్ సుజాత అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులతో ఇంటి వద్దే ఓటు వేయించే విధానం వివరించారు. కార్యక్రమంలో డీటీ శంకర్, ఆర్‌ఐలు లక్ష్మణ్, తక్కన్న తదితరులు ఉన్నారు.

పొలాలు పరిశీలన


పొలం పరిశీలిస్తున్న ఏఈవో అంబాజీ

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో మంగళవారం వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను వ్యవసాయ విస్తరణాధికారి అంబాజీ పరిశీలించారు. మొగి పురుగు, అగ్గితెగులు, ఎండు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు క్లోరాంత్రనిప్రోల్, 80మి.లీ, లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 400 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు జీలకర వేణు, కొండ రవి ఉన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీలోని సీసీ రోడ్ల పనులను మంగళవారం ఎంపీఓ శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. పనులు సక్రమంగా జరిగేలా చూడాలని కోరారు. మోతిలాల్ పటేల్ పాల్గొన్నారు.

జీతాల కోసం ఎదురుచూపు

- వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా కడెం ప్రాజెక్ట్‌పై 30 మందికి విధులు
- ఆగస్టు నుంచి జీతాలు రాక ఇబ్బందులు
- కుటుంబ పోషణ భారమైందని.. సమస్య పరిష్కరించాలని వేడుకోలు


ఆందోళన వ్యక్తం చేస్తున్న సిబ్బంది


ప్రాజెక్టుపై డ్యూటీకి వెళ్తున్న సిబ్బంది (ఫైల్)

కడెం: గత ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కడెం ప్రాజెక్ట్‌కు 30 మంది సిబ్బందిని కేటాయించారు. వీరు గతేడాది ఆగస్టు నుంచి ప్రాజెక్ట్, ఇరిగేషన్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని.. ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని మంగళవారం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు.

మామూళ్ల కోసమేనా..?

వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా మిషన్ భగీరథ, మున్సిపల్, పీహెచ్‌సీ, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న వారికి జీతాలు అందుతున్నాయి. కేవలం కడెం ప్రాజెక్ట్‌పై విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రం ఇప్పటికీ జీతాలు విడుదల కాకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కేవలం మాముళ్ల కోసమే జీతాలు ఆలస్యం అవుతున్నాయనే ఆరోపణాలున్నాయి. ఇప్పటికే సిబ్బంది రూ.వెయ్యి చొప్పున జమ చేసి ఇరిగేషన్ కార్యాలయ అధికారులకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే అ మాముళ్లకు ఒప్పుకోక జాప్యం చేస్తున్నారని ఓ ఉద్యోగి తెలిపారు.

ఇంకెన్నాళ్లు.. ఈ వెట్టిచాకిరీ

వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా జిల్లాలోని తానూర్, లోకేశ్వరం, తదితర మండలాల నుంచి వీఆర్‌ఏలు కడెం ప్రాజెక్ట్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో యాభై ఏళ్లకు పైబడిన వారే ఎక్కువ. అయినప్పటికీ కడెంలోనే అద్దెకు ఉంటూ రోజూ విధులకు వెళ్తున్నారు. ఏడు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని.. అప్పులు తెచ్చి జీవనం సాగిస్తున్నామని సిబ్బంది వాపోతున్నారు.

తిండికి ఇబ్బంది



మాది తానూరు మండలం.. కడెం ప్రాజెక్ట్‌పై ఉద్యోగం ఇవ్వడంతో ఇక్కడే కిరాయికి ఉంటూ విధులు నిర్వర్తిస్తున్న. జీతాలు రాక ఇంటి కిరాయి కట్టలేదు. తిండికి కూడా ఇబ్బంది అవుతుంది. సార్లు ఇకనైనా మాకు జీతాలు ఇప్పించాలే.

– రుక్మాబాయి

ఇంకో నాలుగు నెలలే



మాది లోకేశ్వరం మండలం.. కడెం ప్రాజెక్ట్‌పై విధులు నిర్వర్తిస్తున్న. ఇంకో నాలుగు నెలలే నా సర్వీసు ఉంది. ఎనిమిది నెలల జీతాలు ఇప్పటివరకు రాలేదు. నా రిటైర్‌మెంట్ పూర్తయ్యే నాటికైనా జీతం వస్తుందో లేదో చూడాలి.

– అడ్డిగామ ఎల్లన్న

పెండింగ్‌లో ఉంది



గత ఆగస్టు నెల నుంచి కడెం ప్రాజెక్ట్‌పై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి జీతాలు విడుదల కాలేదు. వీరి ఫైలు జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ పీవో కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. త్వరలోనే జీతాలు విడుదలవుతాయి. మా సిబ్బంది డబ్బులు అడిగిన విషయం నా దృష్టికి రాలేదు.

– భోజదాసు, డీఈ

కేంద్రాల్లో పౌష్టికాహారం అందించాలి

తానూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి అన్నారు. మంగళవారం పోషణ్ పక్వాడాలో భాగంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో మాట్లాడారు. రక్తహీనత బారిన పడకుండా గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 23 వరకు అన్ని గ్రామాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్ వందన తదితరులు పాల్గొన్నారు.


తానూరులో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీమతి

కుటుంబ సర్వే చేపట్టాలి

ఖానాపూర్: ఈనెలలోనే అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో కుటుంబసర్వే చేపట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. మంగళవారం మండలంలోని గోసంపల్లె, దిలావర్‌పూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కుటుంబసభ్యుల వివరాలను ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో.. చిన్నారుల బరువు, ఎత్తుల వివరాలను పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. లబ్ధిదారులు కేంద్రాల్లో భోజనం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సాధన, లక్ష్మి, హెల్పర్లు ఉన్నారు.


దిలావార్‌పూర్‌లో పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

విఠాపూర్‌లో..

కుంటాల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి విశారద సూచించారు. మంగళవారం మండలంలోని విఠాపూర్ గ్రామంలో పోషణ్ పక్వాడలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, శ్యామల పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చనలో మహిళలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో అగ్గిమల్లన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపారాయణం, పంచామృతాభిషేకం, నవగ్రహ హోమం, యాదాకాల పూజలు, గ్రామోత్సవం, దీపోత్సవం, ధాన్యాధివాసం, ఆదివాస హోమాలు నిర్వహించారు. భక్తులకు బుధవారం అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్, కొత్తపేట్, బావాపూర్(కే), గోసంపల్లె, దిలావర్‌పూర్, గోడలపంపు గ్రామాల్లో మంగళవారం పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి రత్నాకర్‌రావు పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరామర్శ

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ పాపాయిగారి రాంరెడ్డి, తోట రాము భార్య సాయవ్వ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈవిషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మంగళవారం బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, మోహినొద్దీన్, నాలం శ్రీనివాస్, గంగారెడ్డి, గంగాధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఖానాపూర్: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్‌ను పట్కరి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలో వేగంగా అభివృద్ధి జరిగేలా కృషి చేయాలని వారు కోరారు. ఇందులో గంగామోహన్, ప్రకాశ్, రమేశ్, శ్రీనివాస్, రవి, లక్ష్మీనారాయణ, హరి, ప్రశాంత్, లోకేశ్, వంశీకృష్ణ, బాలకృష్ణ, శంకర్ తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు చక్రపాణి నర్సింహమూర్తి, నాగరాజుశర్మ, రాజశేఖర్ శర్మ, శరత్‌చంద్ర శర్మ ఆధ్వర్యంలో శాంతిహోమం, పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చనలు, అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదం అందజేశారు.

అటెన్షన్ ప్లీజ్..

ప్రమాదకరంగా నియంత్రిక



లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన విద్యుత్ నియంత్రిక చుట్టూ కంచె లేకపోవడంతో అటువైపు వెళ్లేవారికి ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ నియంత్రిక చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : మహేశ్, విద్యుత్ ఏఈ, ఫోన్: 94408 11706

మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వద్దు


రాయపూర్‌కాండ్లీ నర్సరీలో పరిశీలిస్తున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

లోకేశ్వరం: నర్సరీల్లో మొక్కల పెంపకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వాటిని కంటికి రెప్పలా కాపాడాలని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాయపూర్‌కాండ్లీ, అర్లి, గొడిసెరా, వట్టోలి, జోహర్‌పూర్ గ్రామాల్లో నర్సరీలను ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భగా ఎంపీడీవో మాట్లాడుతూ నర్సరీల్లోని మొక్కలకు సకాలంలో నీటిని అందిస్తూ.. కలుపు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాలులో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులుగా గంగాధర్‌గౌడ్, కె.పోతారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.మల్లేశ్వర్, కోశాధికారిగా చింతకింది శేఖర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా సమ్మెట రవి, సంయుక్త కార్యదర్శిగా బుర్క ముత్యం, కార్యవర్గ సభ్యులుగా గుండం శ్రీనివాస్, సిర్ర లింగన్న, పల్లె శ్రీనివాస్ హైమత్, అట్ల శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల రమేశ్, మేదరి భోజన్నను ఎన్నుకున్నారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కోమటి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా జడ్డి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బీర్కుల నర్సయ్య, సాకలి రాజేందర్, కోశాధికారిగా గడ్‌వందా మహిపాల్, మొగ్గం సామెల్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా భీమన్న, ఉపాధ్యక్షులుగా సంతోష్, వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా ప్రేమ్ సింగ్, సంయుక్త కార్యదర్శిగా బొర్రన్నను ఎన్నుకున్నారు. ఈటల శ్రీనివాస్, అట్ల రవీందర్‌రెడ్డి, అట్ల చిన్నరాంరెడ్డి, నారాయణ, వినేశ్, నాగేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై గ్రామస్తుల హర్షం


డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో గ్రామస్తులు

సోన్: మండలంలోని వివిధ గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్) రూ.78 లక్షలు మంజూరు చేయించినందుకు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సన్మానించారు. పాక్‌పట్ల గ్రామంలో రెడ్డి సంఘ భవనానికి రూ.10 లక్షలు, మాదిగ సంఘ భవనానికి రూ. 5 లక్షలు, ఓడ్డెర సంఘ భవనానికి రూ.5 లక్షలు, కుమ్మరి సంఘ భవనానికి రూ5.లక్షలు మంజూరు చేసినట్లు మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపి శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పాక్‌పట్ల గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థినుల భద్రత కోసమే షీటీంలు


సదస్సులో మాట్లాడుతున్న సీఐ సైదారావు

ఖానాపూర్: మహిళలు, విద్యార్థినుల భద్రత కోసమే షీ టీంలు పని చేస్తాయని.. ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో షీ టీం సేవలపై కల్పించారు. సైబర్ నేరాలు, మహిళల అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసే విధానం వివరించారు. బాల్యవివాహాలు, అక్రమ దత్తత, బాలలతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఆపదలో 100తో పాటు 871265 9550 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ఎస్సై లింబాద్రి, షీ టీం ఎస్సై సుమలత, సిబ్బంది ఉన్నారు.

పేద కుటుంబానికి చేయూత

ఖానాపూర్: పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన వడ్ల భూమేశ్ బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడగా ఇటీవల హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందాడు. ఖానాపూర్‌కు చెందిన ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు నిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి బిల్లులో నుంచి రూ.80 వేలు మాఫీ చేయించినట్లు పేర్కొన్నారు. డిశ్చార్జ్ అనంతరం హైదరాబాద్ నుంచి ఖానాపూర్‌కు భూమేశ్ వచ్చేలా అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి నెల రోజులకు సరిపడ సరుకులు అందజేశారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి ప్రకాశ్

కుంటాల: మూగజీవాలు వ్యాధుల బారిన పడకుండా ప్రభుత్వం ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తుందని పశువైద్యాధికారి ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లింబా(కే)లో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు నిలిపివేయాలి

ఖానాపూర్: మండలంలోని బీర్నందిలో నిర్మించే గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని వీడీసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. గతంలోనే కనీసం రెండు గుంటలు కూడా లేని పంచాయతీ స్థలం భవన నిర్మాణానికి సరిపోదని తెల్పడంతో అధికారులు పనులు చేపట్టలేదని పేర్కొన్నారు. భవనానికి కనీసం ఐదు గుంటలు ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బోడకుంటి శ్రీనివాస్, లాగెల రాజన్న, భీమలింగు, మల్లేశ్, గోపాల్, నవీన్‌యాదవ్, రవి, శ్రీనివాస్, రాజేశ్వర్, నాగరాజు, రాజమల్లు, రాజన్న, గంగన్న, రాజు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యసూత్రాలు పాటించాలి

కుంటాల: విద్యార్థులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యులు శృతిరెడ్డి, తేజస్విని సూచించారు. కుంటాల సృజన విద్యా నిలయం పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా కుంటాల పీహెచ్‌సీకి వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్యాదరి మహేందర్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు పరిశీలన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్‌కు చేపట్టిన మరమ్మతులను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పరిశీలించారు. ఈసందర్భంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పనులను పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

సోన్: బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని కూచన్‌పెల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ అర్జున్ లింగన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. త్వరలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో వంద మంది అనుచరులతో కాంగ్రెస్‌లో చేరుతానని పేర్కొన్నారు.

శ్రీసిద్ధేశ్వర ఆలయంలో హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని పాతడొంగుర్గాం గ్రామంలో శ్రీ సిద్ధేశ్వర ఆలయంలో మంగళవారం హోమం కాల్చి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం దత్తాత్రేయ, నవగ్రహ, ధ్వజస్తంభ, నంది విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ స్థాపన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నిధులు మంజూరు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో కుమ్మరి సంఘ భవన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కుమ్మరి సంఘ భవన నిర్మాణం పరిశీలించి సంఘ సభ్యులతో మాట్లాడారు. దశరథ రాజేశ్వర్, మహేశ్, రాజు, లస్మన్న తదితరులు ఉన్నారు.